మల్లన్న జాతరకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ఆహ్వానం


శంభీపూర్ రాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): భౌరంపేటలో ఈ నెల 28 నుంచి 30 వరకు మల్లన్న జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మల్లన్న జాతరకు హాజరుకావాలని ఎమ్మెల్యే వివేకానంద్‌కు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు శనివారం గ్రామస్తులతో కలిసి కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి ఆహ్వాన పత్రికలు అందజేశారు. రేణుకా ఎల్లమ్మదేవి కల్యాణం, భ్రమరాంభిక మల్లికార్జున స్వామికల్యాణం కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకోవాలని వారు కోరారు.

మోటార్ వెహికల్ చట్టాన్ని రద్దు చేయాలి


మాట్లాడుతున్న యూసుఫ్

షాపూర్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మోటార్ వెహికిల్ యాక్ట్-2023ను వెంటనే ఎత్తివేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ డిమాండ్ చేశారు. శనివారం షాపూర్ నగర్‌లోని పొట్లూరి నాగేశ్వర రావు భవన్‌లో కుత్బుల్లాపూర్ మండల ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం నియోజక వర్గ అధ్యక్షుడు హరినాథ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా 11 మందితో నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడుగా రాజ్‌కుమార్, కార్యదర్శిగా ఎల్ల స్వామి, కోశాధికారిగా కుమార్, గోపి, గౌస్, కృష్ణజహంగీర్, పూర్ణచందర్, బాల చందర్‌లు ఎన్నికయ్యారు. అనంతరం యూసుఫ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం లారీ, ట్రక్, ఆటో డ్రైవర్లకు నష్టం కలిగించేలా మోటార్ వెహికల్ యాక్టు 2023 తీసుకు వచ్చిందని, ఎవరూ కావాలని యాక్సిడెంట్ చేయరని, వెంటనే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు : కమిషనర్

గాజులరామారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు ఉంటాయని కార్పొరేటర్ రావుల శేషగిరి, గాజుల రామారాం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి హెచ్చరించారు. శనివారం డివిజన్ పరిధిలోని మహాదేవపురం కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. మహాదేవపురం చౌరస్తా నుంచి కైలాస్‌హిల్స్ వరకు జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపించిందని, ప్రధాన రోడ్డు సగం మేర ఆక్రమణకు గురైందని కాలనీవాసులు వారి దృష్టికి తీసుకు వెళ్లారు. రెండు, మూడు రోజుల్లో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి: పండాల

ఫతేనగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్‌లో ఎలాంటి సమస్య వచ్చిన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం డివిజన్ పరిధిలోని పైప్‌లైన్ రోడ్డు, నేతాజీ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఏఈ పవన్, జవాన్ పోచయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు వరాహాల స్వామి కార్యదర్శి వెంకట్రామ నరసయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలి


మాట్లాడుతున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్‌లో పెట్టకుండా కమిటీలు అంటూ కాలయాపన చేయడం బీజేపీ ప్రభుత్వానికి తగదని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ నెరవేర్చకుండా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కాలయాపన చేస్తున్నాయని వాపోయారు. మాదిగలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ మల్లేష్, గణేష్, కృష్ణ యాదగిరి, శ్యామ్ రావు, రాజేష్, హన్మంతు, కొల్లూరు వెంకట్, ఎల్.నాగరాజ్, కె.వెంకట్ పాల్గొన్నారు.

పెన్ షో


ప్రదర్శనలో వివిధ రకాల పెన్నులు

గచ్చిబౌలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చేతి రాతను మరిచిపోతున్న ఈ రోజుల్లో పెన్ షోలు నిర్వహించడం గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. కొండాపూర్‌లోని శరత్‌మాల్‌లో ఇండియన్ పెన్‌షో -2024 శనివారం నిర్వహించారు. పలువురు ఔత్సాహిక చేతిరాత రాసే వారు ఖరీదైన పెన్నులు కొనుగోలు చేశారు. ఈ షోలో దాదాపు 100 రకాల పెన్నులు ప్రదర్శించారు.

కూకట్‌పల్లి ఎమ్మెల్యేపై కేసు

- గోప్యంగా ఉంచిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, జనవరి20 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎమ్మెల్యేపై కేసు నమోదైంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో నియోజకవర్గ పరిధి బాలానగర్ డివిజన్‌లోని ఓ కాలనీలో ఇద్దరికి తోపుడుబండ్లను పంపిణీ చేసినట్టుగా కొందరు స్థానికులు ఫిర్యాదు చేశారు. దాంతో చర్యలు తీసుకోవాలని ఈసీ.. అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ఎన్నికల నియమావళి కొనసాగుతుండగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా ఎమ్మెల్యే కృష్ణారావు వ్యవహరించారంటూ స్థానికులు కోర్టును ఆశ్రయించారు. ఎన్నికల కమిషన్, కోర్టు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది. కేసుకు సంబంధించిన వివరాల కోసం కూకట్‌పల్లి పోలీసులను సంప్రదించగా వారు సమాచారం ఇచ్చేందుకు నిరాకరించారు. కేసు వివరాలను కూకట్‌పల్లి పోలీసులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

రంజిత్‌రెడ్డి దోచుకునేందుకే వచ్చాడు

- జిల్లాలో భూముల స్కాములన్నింటిలోనూ పాత్రధారే
- మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నేతలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి జిల్లాలో ఆస్తులు కొల్లకొట్టేందుకే వచ్చారని బీజేపీ నేతలు ఆరోపించారు. జిల్లాలోని పలు భూముల కుంభకోణాలతో పాటు రాష్ట్రంలో కోళ్లదాణ, కోడిగుడ్ల స్కామ్‌లకు ఆయనే సూత్రధారి అని ఆరోపించారు. లక్డీకపూల్‌లో శనివారం బీజేపీ నేత, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవియాదవ్ తదితరులు మాట్లాడారు. రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు, దందాలు తప్పా ఆయన చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. రంజిత్‌రెడ్డికి స్థానిక సమస్యలపై అవగాహన లేదని అన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మాత్రమే ఆయనకు తెలుసని విమర్శించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నా ఆయన ఫామ్ హౌస్‌కు మాత్రం కొత్త రోడ్డు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన నానక్‌రాంగూడ, గోపన్నపల్లి భూముల కుంభకోణాలతో పాటు ఫిల్మ్‌నగర్‌లో రూ.వందల కోట్ల దేవాలయ భూములు కొల్లకొట్టిన వ్యవహారంలో కూడా రంజిత్‌రెడ్డే సూత్రధారి అని విమర్శించారు. మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్ శివార్లలో అనేక భూదందాలు చేశారని, వీటన్నింటిపై తాము విచారణ కోరతామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైఖరి వల్లే హైదరాబాద్ - బీజాపూర్ హైవే పనులు నిలిచిపోయాయని, రోడ్డు విస్తరణ పనులు ఆగిపోతే ఎంపీ రంజిత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంత అసమర్థ ఎంపీని ఎక్కడా చూడలేదన్నారు. శంకరపల్లిలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగితే ఆయన ఎక్కడున్నారన్నారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన శాస్తి చేస్తాం

ఎంపీ రంజిత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని వారు హితవు పలికారు. లేదంటే తగిన శాస్తి చేయాల్సి ఉంటుందని బీజేపీ నేతలు హెచ్చరించారు. ఇటీవల మాజీ ఎంపీ విశ్వేశ్వరెడ్డిపై రంజిత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట ఒక గ్రామ సర్పంచ్‌కి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరెడ్డి ఫోన్ చేసి తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితే బీజేపీలోకి రావాలని కోరారని చెప్పారు. దీనిపై రంజిత్‌రెడ్డి స్పందించిన తీరు సిగ్గుచేటన్నారు. డబ్బు, హోదాను చూసి అహంకారంతో వ్యవహరిస్తున్నారని ఆయనకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పరిగి నేత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడే చిత్తారమ్మ ప్రధాన జాతర

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వివేకానంద్


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



షాపూర్‌నగర్, జనవరి20(ఆంధ్రజ్యోతి): చిత్తారమ్మ అమ్మవారి జాతర ప్రధాన ఘట్టం నేడు జరగనుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అమ్మవారికి పూర్ణాహుతి, గవ్యాంత పూజలు, మూలమంత్రజపం, ఆవాహియ దేవతాహోమాలు, చండీహోమం, బలిప్రధానం వంటి కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 5గంటలకు పూలఘటం గాజులరామారం నుంచి చిత్తారమ్మ దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు.


అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

జాతర ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

శనివారం చిత్తారమ్మ ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సమావేశ మందిరంలో జాతర ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే జాతరల్లో చిత్తారమ్మదేవి జాతర కూడా ఒకటని ఎమ్మెల్యే అన్నారు.

జాతరలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రాచకొండ బాల్‌రాజ్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, బాలానగర్ డీసీపీ ఎస్.శ్రీనివాసులు, అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కుటుంబ సభ్యులు

- వృద్ధురాలి కళ్లు దానం


సంపూర్ణమ్మ(ఫైల్)

నిజాంపేట్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సమాజం పట్ల వారికి ఉన్న బాధ్యతను మరువకుండా, కుటుంబ సభ్యులు వృద్ధురాలి కళ్లను ఆస్పత్రికి దానం చేసి మానవత్వం చాటుకున్నారు. నిజాంపేట కార్పొరేషన్, బాచుపల్లి హరితవనం కాలనీ శ్రేయ రెసిడెన్సీలో నివాసముంటున్న అరికపూడి హరిప్రసాద్ తల్లి సంపూర్ణమ్మ(80) పరమపదించారు. మృతురాలి మనుమడు ప్రవీణ్ నాయనమ్మ కళ్లను దానం చేద్దామని కుటుంబ సభ్యులతో మాట్లాడి ఒప్పించాడు. వారందరి అంగీకారంతో సరోజినిదేవి కంటి ఆస్పత్రి ప్రతినిధులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి కళ్లను సేకరించి తీసుకెళ్లారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

నిజాంపేట్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనలు అందరూ పాటించాలని ట్రాఫిక్ సీఐ కిరణ్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం నిజాంపేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. రోడ్లపై ప్రయాణిస్తున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ శ్రీనివాసులు, కూకట్‌పల్లి ఏసీపీ వెంకట్‌రావు, మియాపూర్ ట్రాఫిక్ సీఐ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ సిబ్బంది



విధినిర్వహణలో ప్రతిభ కనబరిచి ఉత్తమ సేవా పతకాలు సాధించిన 138 మంది సైబరాబాద్ పోలీస్ సిబ్బందికి సీపీ అవినాష్ మహంతి పతకాలు అందజేశారు. వారిలో 58 మంది ఉత్కృష్ట పతకాలు సాధించగా, 80 మంది ఉత్తమ సేవాపతకాలు సాధించినట్లు సీపీ తెలిపారు. పతకాలు సాధించిన వారిలో కానిస్టేబుల్ స్థాయి నుంచి అడిషనల్ డీసీపీ స్థాయి అధికారుల వరకు ఉన్నారు. ఇదే స్ఫూర్తితో సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.

-హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

నిర్మాణ వ్యర్థాలు ఏజెన్సీలకు మాత్రమే ఇవ్వాలి: జడ్సీ

గచ్చిబౌలి/చందానగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిర్మాణ వ్యర్థాలు ఇష్టానుసారు ఆరుబయట పడవేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని జీహెచ్‌ఎంసీ నిబంధనల ప్రకారం జరిమానా విధించి, కేసులు నమోదు చేయాలని జోనల్ కమిషనర్ స్నేహశబరీ అధికారులను ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో శేరిలింగంపల్లి,చందానగర్ అధికారులతో మరోమారు సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో పెద్ద మొత్తంలో ఫిర్యాదులు రావడంతో శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఎన్‌డీ అధికారులు టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు. సీఎన్‌డీ వ్యవస్థను ఉపయోగించి వ్యర్థాల తరలింపు చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాంకీ, సీఎన్‌డీ సంస్థలు పనిచేస్తున్నాయని, ఈ వ్యర్థాలను సేకరించి నిర్దేశించిన ప్రాంతాల్లో డంప్‌చేయాలని అధికారులకు సూచించారు. నిబంధనులు అతిక్రమిస్తే చట్టరీత్యా మొదటిసారి ఉల్లంఘించిన వారికి రూ.25వేలు, రెండోసారి రూ.50వేలు, మూడోసారి రూ.లక్ష జరిమానా విధిస్తూ వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ వ్యర్థాల తరలింపు కోసం 18001 201159, 91009 27073 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని, లేదా జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్ యశోద ఆస్పత్రి రోడ్డు, హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ అధికారులతో కలిసి పర్యటించి భవన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను పరిశీలించారు. నిర్దిష్టమైన ప్రదేశాల్లోనే డంపింగ్ వ్యర్థాలను వేయాలని జడ్సీ అన్నారు.

కులగణనను రాజకీయ అంశంగా చూడొద్దు


సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

రాయదుర్గం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కులగణను రాజకీయ అంశంగా చూడొద్దని పలువురు వక్తలు అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కులగణన అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సులో ద్రావిడ కజగం అధ్యక్షుడు డాక్టర్ వీరమణి, విద్యావేత్త శ్యామ్ పెట్రోడ, భారత్ జోడో అభియాన్ కోఆర్డినేటర్ యుగేంద్ర యాదవ్, రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ వెంకటేష్, నేషనల్ ఓబీసీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, ఉద్యమకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సదస్సులో కులగణన అంశంపై చర్చించారు. కులగణన కేవలం రిజర్వేషన్లు పెంచడానికే కాకుండా సామాజిక న్యాయానికి సమగ్ర ఆర్థిక అభివృద్ధికి, అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్య అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని వక్తలు తెలియజేశారు. కులగనన రాజకీయ అంశంగా చూడవద్దని, సామాజిక విప్లవానికి దారి చూపే అంశంగా చూడాలన్నారు. ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ద్వారా వచ్చిన డేటా ద్వారా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆళ్ల రామకృష్ణ సూచించారు. కార్యకరమంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి సాయికిరణ్, రాష్ట్ర కార్యదర్శి కొండల్, మురళీయాదవ్, శివయాదవ్, ప్రవీణ్, దీపక్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ప్రొఫెసర్లకు బదిలీలు

హైదరాబాద్ సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో పలువురు ప్రొఫెసర్లను అనుబంధ కళాశాలలకు బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ ఉత్తర్వులు జారీచేశారు. క్యాంపస్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎన్‌వీఎస్ రాజును వనపర్తి జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. అలాగే, వనపర్తి జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఇందిరరాణిని, సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ పద్మావతిని క్యాంపస్ కళాశాలకు బదిలీ చేశారు. ఇదిలా ఉంటే.. క్యాంపస్ కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతిగా డాక్టర్ సత్యనారాయణను, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగాధిపతిగా డాక్టర్ శోభారాణి నియమితులయ్యారు.

నేడే కల్యాణ్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

బాలానగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్.. కల్యాణ్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం స్థానిక కమ్యూనిటీ హాలులో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 165 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని, ఎన్నిక పూర్తయిన అనంతరం ఓట్ల లెక్కింపును పూర్తి చేసి ఫలితాలను వెల్లడించనున్నట్లు ఎన్నికల నిర్వహణాధికారి కృష్ణయ్య తెలియజేశారు. అధ్యక్ష పదవికి కలకుంట్ల స్వాతి, వసంత్‌రావు పోటీ పడుతున్నారు.


మాట్లాడుతున్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ టి.కె. చూడామణి

గురువుల బోధనతో ప్రగతికి బాటలు

అల్వాల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): లౌకికంగా కాని ఆధ్యాత్మికంగా కాని పురోగతిని పొందాలంటే సద్గురువుల మార్గదర్శనం లభించాల్సిందేనని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త డాక్టర్ టి.కె. చూడామణి అన్నారు. ఓల్డ్ అల్వాల్‌లో శ్రీవైష్ణవ సంప్రదాయ పరిరక్షణకు, ప్రచారానికి జీవితకాలం కృషి చేసిన స్వామినాథ దేశిక, శ్రీరంగ శఠకోప దేశిక, వెంకట నరసింహ దేశికుల జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న విశిష్ట ఉపన్యాస కార్యక్రమానికి రెండో రోజు శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏ రంగంలో రాణించాలన్నా, ఆయా రంగాల్లో నిష్ణాతులైన గురువుల బోధనలను శ్రద్ధగా విని, వాటిని ఆచరించాలి. అప్పుడే ప్రగతిపథంలో పయనించగలుగుతామని పేర్కొన్నారు. నిర్వాహకులు సముద్రాల శఠగోపాచార్య మాట్లాడుతూ తరతరాలకు చెరగని నిధిగా విజ్ఞాన సంపదను మన పూర్వీకులైన ఆచార్యులు సమాజానికి గ్రంథస్థం చేసి సురక్షితంగా అందించారని, వాటిని అధ్యయనం చేసి ఆదర్శవంతమైన జీవనాన్ని గడపాలన్నారు. ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక యువతకు అందించేందుకు తాను 15 గ్రంథాలను రచించానని, ప్రముఖ దినపత్రికలలో వ్యాసాలను రచిస్తూ కాలమిస్ట్‌గా బాధ్యతలు కొనసాగిస్తున్నాని ఆయన పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న అల్యూమినియం ఉత్పత్తులు


స్టాల్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ శివకోటి రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విభిన్న రకాల్లో అందుబాటులోకి వస్తున్న అల్యూమినియం తలుపులు, కిటికీల డిజైన్లు ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్ హైటెక్స్‌లో ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్ పేరుతో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రదర్శనలో కొత్త రకం అల్యూమినియం తలుపులు, కిటికీలు తయారు చేస్తున్న ఎన్‌కోర్ అల్కమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రేడ్ ఫెయిర్‌లో 1.8 టన్నుల బరువైన 18 అడుగులు ఎత్తైన కిటికీని ప్రదర్శనలో ఉంచామని, అంతేకాకుండా సంస్థ తయారు చేస్తున్న ఇతర ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్లు ఎన్‌కోర్ అల్కమ్ సంస్థ ఫౌండర్, సీఎండీ అవుతు శివకోటి రెడ్డి తెలిపారు. అదానీ పోర్ట్స్ లాజిస్టిక్ కార్పొరేట్ అఫైర్స్ ఏపీ, తెలంగాణ హెడ్ పి.అంజిరెడ్డి, కార్పొరేట్ అఫైర్స్ ప్రతినిధి రవినాథ్‌రెడ్డిలు శనివారం స్టాల్స్‌ను సందర్శించారు. విభిన్న, వినూత్న ఉత్పత్తులు అన్నీ ఒకేచోట ఉండటంతో కొత్త డిజైన్లు కోరుకునే వారికి ప్రదర్శన ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌కోర్-అల్కమ్ ఫౌండర్. సీఎండీ శివకోటిరెడ్డి, డైరెక్టర్ జయంతి భాయ్, మనుభాయ్, ఎన్‌కోర్ డైరెక్టర్లు పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీహర్ష పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమ్

25న జేఎన్టీయూలో జాతీయ ఓటరు దినోత్సవం

- హాజరు కానున్న గవర్నర్ తమిళి సై

హైదరాబాద్ సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25న జేఎన్టీయూలో నిర్వహించనున్న కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరు కానున్నట్లు మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పొట్రు తెలిపారు. శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో కలిసి వర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాట్లను, వసతులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోటు పాట్లు జరగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గవర్నర్ ప్రసంగించే సమయంలో సభావేదికపై చేయాల్సిన ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి వచ్చే వీఐపీల కోసం చేయాల్సిన వసతులను పరిశీలించారు. జిల్లా పరిధిలో జరిగే ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమానికి వచ్చే వారి వాహనాలకు పార్కింగ్ విషయమై పోలీసులకు కలెక్టర్ గౌతమ్ పలు సూచనలు చేశారు. కలెక్టర్ పర్యటనలో కూకట్‌పల్లి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్లు అభిలాష్ అభినవ్, వెంకటేష్, ఆర్డీవో శ్యాంప్రకాశ్ ఇతర అధికారులు ఉన్నారు.

రేపు శ్రీరామ పట్టాభిషేకం

బంజారాహిల్స్ / హైదర్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకొని విశాఖ శారదాపీఠ పాలిత ఫిలింనగర్ దైవసన్నిధానంలో కోదండరామస్వామి దేవాలయంలో 22వ తేదీ వరకూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సినీనటుడు, ఆలయ చైర్మన్ డాక్టర్ మోహన్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ శనివారం మన్యుసూక్త సహిత హనుమాన్ గాయత్రిహోమం, రామాయణం ఉత్తర కాండ ప్రవచనం నిర్వహించినట్టు వివరించారు. 21న సీతారామస్వామి మూల విరాట్‌కు విశేష నదీసాగర జలాలతో అభిషేకం, 22న సప్తవిధ పుష్పార్చన, సీతరామ నగర రథయాత్ర, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్టు వివరించారు. రేపు కూకట్‌పల్లిలో శ్రీరాముడి శోభయాత్ర నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ కూకట్‌పల్లి అధ్యక్షుడు మహాశృంగదాస పేర్కొన్నారు. యాత్ర హైదర్‌నగర్ మైసమ్మగుడి నుంచి ప్రారంభమై కూకట్‌పల్లి మెట్రోట్రాక్ పార్కింగ్ వద్ద ముగుస్తుందని తెలిపారు. శనివారం ఆల్విన్‌కాలనీ ఇస్కాన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవడానికి జాతీయ సమైక్యత శిబిరాలు


కార్యక్రమంలో చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు

దుండిగల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవడానికి జాతీయ సమైక్యత శిబిరాలు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు జరిగిన జాతీయ సమైక్యత శిబిరం శనివారం ముగిసింది. ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ అధికారి పి.అశోక్‌రెడ్డి, రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు హాజరయ్యారు. జాతీయ సమైక్యత శిబిరాలు దేశ సమైక్యత కోసం బలమైన సద్భావన వాతావరణాన్ని కల్పిస్తాయని వారన్నారు కార్యక్రమంలో యూత్ ఆఫీసర్ ఆర్.సైదా, సంజయ్‌కుమార్, జేఎన్‌టీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగామ్ కో-ఆర్డినేటర్ శోభారాణి, ఎంఎల్‌ఆర్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ఉదయ్